సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ￨ 23 ￨ మార్చి ￨ 2023



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ఐరన్ పోల్స్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ వేగంగా ఢీకొంది. దీంతో ఢీకొన్న లారీలోని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,550
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,408
3 శాతం జీఎస్టీతో	రూ.5,570
నవర (8 గ్రా)	రూ.44,560

గరిష్టం/కనిష్టం

34.6 /25.9

వాతావరణం

బుధవారం గాలిలో 72 శాతం తేమ ఉంది. గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది. ఉక్కపోత అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

సహకార శాఖ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో తిక్కన ప్రాంగణం పక్కన ఆధునికీకరించిన భవనంలోని మొదటి అంతస్తును జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయానికి కేటాయించారు. ఉగాది పండగ సందర్భంగా దానిని బుధవారం కలెక్టర్ కేవీఎస్ చక్రధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి కలెక్టరేట్ ఆవరణలోనే సహకార శాఖ కార్యకలాపాలు జరుగుతాయన్నారు. ప్రజలకు దగ్గరగా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) తిరుపాలురెడ్డి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ సుధాకర్‌రాజు, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై నృసింహుని విహారం



రాపూరు: ఉగాదిని పురస్కరించుకుని బుధవారం పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ నిర్వహించారు. సర్వాలంకారభూషితులైన శ్రీవారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అలాగే శ్రీవారి కల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. దేవదేవేరుల కల్యాణం జరిపించారు. అర్చకులు శశిస్వామి, అమరేంద్రస్వామి, వేద పండితులు సాయిప్రసాద్‌స్వామికి ఈఓ జనార్దనరెడ్డి ఉగాది పురస్కారాలను అందించారు.


విద్యుదాఘాతంతో యువకుడి మృతి



శంకర్‌సదా మృతదేహం

ఉలవపాడు: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చాకిచర్ల పంచాయతీ శ్రీరామపురంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బిహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన శంకర్ సదా (20) అనే యువకుడు శ్రీనివాస బయోప్లాంట్ నర్సరీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఇనుప రాడ్‌తో టార్పాలిన్ పట్టను పైకి ఎత్తుతున్న సమయంలో విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడుగడుగునా నిఘా



వేసవి కాలం వచ్చేసింది. విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యాక అనేక కుటుంబాలు సొంతూర్లకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఈ నేపథ్యంలో రైళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో దొంగలు తమ చేతులకు పని చెబుతుంటారు. దొంగతనాలకు చెక్ పెట్టేందుకు రైల్వే పోలీసులు చర్యలు తీసుకున్నారు. నెల్లూరు రైల్వే సబ్ డివిజన్ పరిధిలో బీట్ వ్యవస్థను పటిష్టం చేశారు. తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

- రైళ్లలో దొంగతనాలకు చెక్ పెట్టేందుకు చర్యలు
- వేసవి నేపథ్యంలో బీట్ల ఏర్పాటు
- విస్తృతంగా తనిఖీలు
- ప్రయాణికులకు అందుబాటులో అధికారుల ఫోన్ నంబర్లు
- దొంగతనాలు జరిగే అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



చీరాలలో బీట్‌బుక్‌ను తనిఖీ చేస్తున్న అధికారి

నెల్లూరు(క్రైమ్): వేసవిలో రైళ్లలో దోపిడీలు, దొంగతనాలు అధికంగా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నెల్లూరు రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్త ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో జిల్లా మీదుగా రాకపోకలు సాగించే అన్ని రైళ్లలో బీట్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా బీట్ సిబ్బంది వద్ద



నెల్లూరు రైల్వే పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్

ఉన్న పుస్తకంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారుల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. ఒకవేళ నేరం జరిగిన వెంటనే ఉన్నతాధికారులు, రైల్వే, స్థానిక పోలీసులకు సమాచారం చేరవేసేలా చర్యలు తీసుకున్నారు. దీని ద్వారా పోలీసులు అప్రమత్తమై నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంది.

ఇలా చేస్తున్నారు

రాత్రి వేళల్లోనే నేరాలు అధికంగా జరిగే అవకాశం ఉంది. దీంతో ఎనిమిది బీట్లను ఏర్పాటు చేశారు. సిబ్బంది రాత్రి ఎనిమిది నుంచి ఉదయం ఆరుగంటల వరకు నెల్లూరు మీదుగా రాకపోకలు సాగించే 19 రైళ్లలో గస్తీ నిర్వహిస్తున్నారు. ఒక్కో బీట్‌లో ఇద్దరు కానిస్టేబుల్స్ ఉంటారు. ఒక కానిస్టేబుల్ వద్ద తుపాకీ, లాఠీ, రెండు టార్చ్‌లైట్లు విజిల్స్ ఉంటాయి. నిందితులను గుర్తిస్తే వెంటనే అదుపులోకి తీసుకుని ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తారు. చీరాల నుంచి రేణిగుంట వరకు రెండు క్రైమ్ పార్టీలు 15 రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. వీక్లీ, స్పెషల్ ట్రైన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బంది బీట్ విధుల్లో ఉన్నారు. కాగా ప్లాట్‌ఫారంలపై విధుల నిర్వహణకు కోసం 12 మంది సిబ్బందితో పది బీట్లను ఏర్పాటు చేశారు. వీరు రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు విధులు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సబ్‌డివిజన్ పరిధిలో డీఎస్పీ పర్యవేక్షణలో ఒక ఎస్సై, ఇద్దరు కానిస్టేబుల్ రోజూ రాత్రి ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు. డీఎస్పీ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇంకా తనిఖీల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఫిన్స్ (ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్‌వర్క్ సిస్టం) డివైజ్ ద్వారా వేలిముద్రలు వేయించి డేటా బేస్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

నేరాలు జరిగేందుకు అవకాశమున్న ప్రాంతాలు



నెల్లూరులో రైల్లో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఔటర్ సిగ్నల్, హోం సిగ్నల్ పాయింట్లు, జాతీయ రహదారికి సమీపంలోని రైల్వేట్రాక్‌ల వద్ద నేరాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. వీటిలో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లలో నెల్లూరు సౌత్ మరియు నార్త్ (హోం సిగ్నల్ పాయింట్), పడుగుపాడు ఔటర్ సిగ్నల్ పాయింట్, గూడూరు సౌత్, వెస్ట్ హోం సిగ్నల్ పాయింట్, సింగరాయకొండతోపాటు జాతీయ రహదారికి దగ్గరగా ఉండే తలమంచి, సింగరాయకొండ, మనుబోలు తదితర ప్రాంతాల్లో సిబ్బంది గస్తీ నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చూస్తున్నారు.

లైటింగ్ ఏర్పాటు

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని రైల్వేస్టేషన్లలో 99 చీకటి ప్రాంతాలను గుర్తించారు. అక్కడ నేరాలు జరిగే అవకాశం ఉండడంతో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

ఆ ముఠాలపై..

రైళ్లలో నేరాలకు పాల్పడే స్థానిక నేరస్తులతోపాటు ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ముఠాలపై సైతం నిఘా పెంచారు. పాతనేరస్తుల ఫొటోలను రైల్వేస్టేషన్లలోని నోటీస్ బోర్డుల్లో ఉంచారు. జైల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రోజూ జైలు నుంచి విడుదలయ్యే వారికి ఏ ప్రాంతం?, ఎక్కడ నివాసం ఉంటున్నారు? తదితర వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం గ్రామ/వార్డు మహిళా పోలీసుల సహకారంతో వారి కదలికలను గమనిస్తున్నారు. వారు తమ ఇళ్లలోనే ఉంటున్నారా? లేదంటే ఎక్కడికి వెళ్లారు? తిరిగి ఎప్పుడు వస్తారు? తదితర వివరాలను రోజూ సేకరిస్తున్నారు.

ఉన్నవారిపై పనిభారం

రైళ్ల సంఖ్య గణనీయంగా పెరిగినా అందుకు సరిపడా సిబ్బందిని నియమించాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో ఉన్న సిబ్బందితోనే బీట్లు వేస్తున్నారు. 151 మందికి గానూ 108 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పని భారం పెరిగింది.

- నెల్లూరు రైల్వే సబ్ డివిజన్ పరిధిలో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలున్నాయి.
- నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న రైల్వే పోలీస్‌స్టేషన్లు : నెల్లూరు, బిట్రగుంట, కావలి, గూడూరు, సూళ్లూరుపేట
- ప్రకాశం జిల్లా పరిధిలో ఒంగోలు, సింగరాయకొండ, చీరాల రైల్వే పోలీస్ స్టేషన్లున్నాయి.

రెండు జిల్లాల పరిధిలో సిబ్బంది వివరాలు

డీఎస్పీ	సీఐ	ఎస్సై	ఏఎస్సై	హెచ్‌సీ	కానిస్టేబుల్స్
1	2	6	1	14	84

నేరాల కట్టడికి చర్యలు



గుంతకల్ జిల్లా రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశాల మేరకు రైల్వేలో నేరాల నియంత్రణకు ఆర్పీఎఫ్, స్థానిక పోలీసుల సహకారంతో చర్యలు చేపట్టాం. బీట్ వ్యవస్థను పటిష్టం చేశాం. నేరాలు జరిగే/అవకాశమున్న ప్రాంతాల్లో సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. పాతనేరస్తులు, అంతర్‌రాష్ట్ర ముఠాల కదలికలపై నిఘా పెంచాం. అన్ని రైళ్లు, స్టేషన్లలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి. నేర నియంత్రణకు తాము తీసుకుంటున్న చర్యలకు సహకరించాలి.

– పి.మల్లికార్జునరావు, నెల్లూరు రైల్వే డీఎస్పీ

కెమెరాలెక్కడ?

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఎన్నో కేసుల ఛేదనకు ఇవి దోహదపడుతున్నాయి. ప్రధాన స్టేషన్లలో కాకుండా నెల్లూరు సౌత్, వేదాయపాళెం, బిట్రగుంట, కావలి, సింగరాయకొండ, కొండగుంట, వెండోడు, వెంకటగిరి, సూళ్లూరుపేటల్లోని స్టేషన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రతి రంగంలో జిల్లా అభివృద్ధి

- కలెక్టరేట్‌లో ఘనంగా ఉగాది సంబరాలు
- పంచాంగ శ్రవణం చేసిన ఆలూరు శిరోమణి శర్మ



పంచాంగ శ్రవణం చేస్తూ..



కవిత వినిపిస్తూ..




ఉగాది సంబరాల్లో కలెక్టర్ చక్రధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు

నెల్లూరు(అర్బన్): 'శోభకృత్ నామ సంవత్సరంలో అన్ని శుభాలే కలుగుతాయి. ప్రతి రంగంలో జిల్లా అభివృద్ధి పయనంలో ఉంటుంది.' అని శిరోమణి శర్మ పంచాంగ శ్రవణం చేశారు. నెల్లూరులోని కలెక్టరేట్లో బుధవారం తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నూతన సంవత్సరాది ఉగాది పండగను నిర్వహించారు. సంప్రదాయ పంచెకట్టుతో వచ్చిన కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబుకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు కవులు తమ కవితలను వినిపించారు. ప్రముఖ పంచాంగకర్త ఆలూరు శిరోమణి శర్మ ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరం జిల్లా ప్రగతికి సోపానం కానుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయలు ఎంతో గొప్పవన్నారు. ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అంది ఆర్థికంగా పరిపుష్టి సాధించాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి అన్నదాతలకు పంటలు బాగా పండాలని కోరారు. వైఎస్సార్ ఆసరాకు సంబంధించి మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే ఉత్సవాల్లో మహిళలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ సుధాకర్‌రాజు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, హార్టికల్చర్ పీడీ సుబ్బారెడ్డి, జిల్లా పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ అధికారి కనకదుర్గాభవాని, ఆర్డీఓ మలోల, బీసీ సంక్షేమ శాఖాధికారి వెంకటయ్య, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

సోమశిలలో 55.634 టీఎంసీలు



సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 55.634 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 320 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

రాబడిలో టాప్

- అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి రైళ్లలో బొగ్గు రవాణా
- ఎనిమిదేళ్ల తర్వాత అధికంగా..



గూడ్స్ రైలులో బొగ్గు లోడింగ్

నెల్లూరు(సెంట్రల్): జిల్లా నుంచి రైల్వే శాఖకు రాబడి అధికంగా వస్తోంది. ఇందులో ప్రధాన ఆదాయవనరుగా అదానీ కృష్ణపట్నం పోర్టు ఉంది. బొగ్గుతోపాటు ఇతర సరుకులు పెద్దఎత్తున గూడ్స్ రైళ్ల ద్వారా రవాణా చేస్తున్నారు.

2014లో టాప్

పోర్టు నుంచి వివిధ సరుకుల దిగుమతులు బాగా జరుగుతున్నాయి. వాటిని ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. 2014–15 కాలంలో రైల్వే శాఖ పోర్టు నుంచి 12.94 మిలియన్ టన్నుల బొగ్గును తరలించి అప్పట్లో రికార్డు సృష్టించింది. ఆ ఏడాదిలో బొగ్గు వల్లే రూ.1,179 కోట్ల రాబడి వచ్చింది. ఇతర సరుకుల రవాణాతో కలిపి మొత్తంగా రూ.1,988.17 కోట్లు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.

ఈ ఏడాదిలో..

ఎనిమిది సంవత్సరాల తర్వాత ఊహించని దాని కన్నా ఎక్కువగా బొగ్గు రవాణా జరిగింది. 2022–23 సంవత్సరానికి 13 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసి రికార్డు సృష్టించారు. దీంతో సుమారు రూ.1,500 కోట్లు, ఇతర సరుకుల రవాణా ద్వారా రూ.500 కోట్ల రాబడి వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో 5 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా కాగా రూ.560 కోట్లు, మిగిలిన సరుకుల రవాణా ద్వారా రూ.391 కోట్లు వచ్చింది. గతేడాది కన్నా ఈ ఏడాది అధికంగా రవాణా సరుకుల ద్వారా జిల్లా నుంచి రైల్వేకి అధికంగానే రాబడి వచ్చింది.

నిత్యం 12 గూడ్స్ రైళ్ల ద్వారా..

పోర్టు నుంచి నిత్యం 12 గూడ్స్ రైళ్ల ద్వారా సరుకులను రైల్వే తరలిస్తోంది. దీంతో రోజుకు రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు వస్తోందని అంచనా. కాగా బొగ్గుతోపాటు ఎక్కువగా ఎరువులు, ఐరన్, లైమ్‌స్టోన్ తదితర సరుకులను రవాణా చేస్తుంటారు.

అందరి కృషితోనే..



జిల్లాలోని అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి ఈ ఏడాది రైల్వేకి అధికంగా రాబడి వచ్చింది. ప్రధానంగా అధికారులు డి.నరేంద్రవర్మ, వి.రాంబాబు, ఇతర అధికారులు, సిబ్బంది చేసిన కృషి వల్ల రైల్వేశాఖ ముందంజలో ఉంది. రానున్న రోజుల్లో ఈ విధంగానే రాబడి వస్తుందని భావిస్తున్నాం.

– శివేంద్ర మోహన్, డీఆర్ఎం, విజయవాడ డివిజన్



ఎరువులను గూడ్స్ రైళ్లలో లోడ్ చేస్తున్న దృశ్యం

ప్రగతి పరుగులు

అన్నివర్గాల సంక్షేమంతో పాటు వారికి కావల్సిన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువల నిర్మాణాలను చేపడుతున్నారు. వీటితోపాటు స్థానిక ఎమ్మెల్యేలు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రతి సచివాలయానికి, నియోజకవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించింది. వీటితో గ్రామస్థాయిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి.



బుచ్చి మండలం రామచంద్రాపురం గిరిజన కాలనీలో సచివాలయ నిధులతో నిర్మించిన సీసీరోడ్డు

- మారిన గ్రామ, పట్టణ రూపురేఖలు
- స్థానిక సమస్యలకు సకాలంలో పరిష్కారం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో..

మొత్తం గ్రామ, వార్డు సచివాలయాలు : 769

సచివాలయాలకు కేటాయించిన నిధులు : రూ. 153.8 కోట్లు

ఎమ్మెల్యేలకు కేటాయించిన నిధులు : రూ.20 కోట్లు

ఏ పనులు చేశారంటే..

- గ్రామ, వార్డు స్థాయిలో అంతర్గత రోడ్డు మరమ్మతులు, సీసీరోడ్ల నిర్మాణం.
- తాగునీటి ట్యాంకులు, కుళాయిల ఏర్పాటుతో గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం.
- శ్మశానవాటికలను అభివృద్ధి చేయడంతో పాటు, శ్మశానాల చుట్టూ ప్రహరీల నిర్మాణం.
- గ్రామాల్లోని కాలనీల్లో విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ లైన్ల ఏర్పాటు.
- సైడ్ కాలువల నిర్మాణం, ఆధునికీకరణ.

బుచ్చిరెడ్డిపాళెం : గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగంగా గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. సచివాలయ స్థాయిలో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్ గ్రామస్థాయిలోనే అభివృద్ధి కోసం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులను కేటాయించారు.

769 గ్రామ సచివాలయాలకు..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 549 గ్రామ సచివాలయాలు, 220 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 769 సచివాలయాలకు రూ.20 లక్షల చొప్పున దాదాపు రూ.153.8 కోట్లను గత నెలలో మంజూరు చేశారు. ఇంత భారీ మొత్తంలో నిధులు మంజూరు కావడంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సిద్ధమయ్యారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

ఎమ్మెల్యే కోటా కింద..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పది నియోజకవర్గాలకు సీఎండీఎఫ్ కింద రూ.20 కోట్ల నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల కాలంలో విడుదల చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రూ.2 కోట్ల చొప్పున కేటాయించడంతో పాటు ఆ నిధులను కూడా అభివృద్ధికి వెచ్చించి త్వరగా పనులను పూర్తి చేయిస్తున్నారు. ఇలా గ్రామ సచివాలయాలకు, ఎమ్మెల్యేలకు కలిపి రాష్ట్ర ప్రభుత్వ రూ.173 కోట్ల భారీ నిధులను వివిధ అభివృద్ధి పనుల మంజూరు చేసింది.



బుచ్చిరెడ్డిపాళెంలో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన సైడు కాలువ

అభివృద్ధికి ప్రాధాన్యం



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యంగా గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యేలు గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించింది. అలాగే ప్రతి ఎమ్మెల్యేకు రూ.2 కోట్ల అభివృద్ధి నిధులను కింద సీఎం కేటాయించారు. వీటితో గ్రామ, వార్డు స్థాయిలో త్వరగా ప్రగతి పనులు జోరందుకున్నాయి. – జెడ్పీ సీఈఓ, చిరంజీవి

ఉగాది వైభోగం

శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని బుధవారం సింహపురి వాసులు వేడుకగా జరుపుకున్నారు. ఇళ్లల్లో మామిడాకులు కట్టి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని చేసుకుని పండగను జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో దేవాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. దేవతామూర్తులకు విశేషాభిషేకాలు జరిపించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈ క్రమంలో నెల్లూరు నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి నగరోత్సవం బుధవారం సాయంత్రం వేడుకగా జరిగింది. నగర నలుమూలల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



నెల్లూరు నగరంలో జనసందోహం మధ్య వేడుకగా సాగుతున్న ఇరుకళల పరమేశ్వరి నగరోత్సవం, (ఇన్‌సెట్లో) విశేషాలంకరణలో అమ్మవారు



నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో కూరగాయలతో శివలింగం, ఓం ఆకారం



నెల్లూరు : మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం



నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో భక్తులు



కావలి : గంగాభవాని జలాభిషేకానికి తరలి వెళ్తున్న మహిళలు



ఆత్మకూరు : గ్రామోత్సవంలో వెంకటేశ్వరస్వామి



ఆత్మకూరు : కోలాటం చేస్తున్న మహిళలు



సూళ్లూరుపేట : విశేషాలంకరణలో చెంగాళమ్మ



చిల్లకూరు : ముత్యాల చీరలో ముత్యాలమ్మ

యువకుడిపై పోక్సో కేసు

నెల్లూరు(క్రైమ్): ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించి మోసగించిన యువకుడిపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురంలోని సర్వేపల్లి కాలువకట్టకు చెందిన ఓ బాలిక కర్ణాలమిట్ట హైస్కూల్లో 2018లో తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలో హరనాథపురానికి చెందిన సందీప్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెతో సన్నిహితంగా మెలిగాడు. అనంతరం ఆమెను దూరం పెడుతూ వచ్చాడు. పెళ్లి చేసుకోమని బాధితురాలు నిలదీయగా, ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకున్నానని చెప్పాడు. పెళ్లి చేసుకోనని.. ఎవరికైనా చెప్పుకోమంటూ ఆమెను బెదిరించాడు. ఈ మేరకు బాలాజీనగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై చీటింగ్, రేప్ సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

రేపు ప్రత్యేక గ్రీవెన్స్ డే

నెల్లూరు(అర్బన్): భూ, లేఅవుట్ ఆక్రమణలు, అడంగళ్ సమస్యలు, తదితరాలపై నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రత్యేక గ్రీవెన్స్ డేను కలెక్టరేట్లో శుక్రవారం ఉదయం 9.30కు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ కూర్మనాథ్ కోరారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.92
సన్నవి : రూ.80
పండ్లు : రూ.40



నెల్లూరు పౌల్ట్రీ

అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:106
లేయర్ (లైవ్)	:75
బ్రాయిలర్ చికెన్	:190
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:210
లేయర్ చికెన్	:128

శ్రీసిటీలో ఉగాది పురస్కారాలు



ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేసిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం : శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో బుధవారం పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా డాక్టర్ కాసల నాగభూషణం, వక్కలంక సీతారామారావు, కుప్పిలి పద్మ, ఒంటి రవి, మహారాజపురం రాము పురస్కారాలు అందుకున్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కళలను ప్రోత్సహించేందుకే సాహిత్య వేదికను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేటకు చెందిన ఎంజీఆర్ మ్యూజిక్ అకాడమీ బృందం వారి వీణావాదన అలరించింది. కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి, శోభారాజా, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, రమేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



ప్రమాదానికి గురైన రెండు లారీలు (ఇన్‌సెట్లో) మృతుడు సంజు

- ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న మరో లారీ
- ఐరన్ పోల్స్‌తో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు
- గుర్తుపట్టలేని విధంగా మృతదేహాలు

కోవూరు : ఐరన్ పోల్స్‌తో వెళ్తున్న లారీని వెనుక వస్తున్న మరో లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన మండల పరిధిలోని పడుగుపాడు బెంజ్ షోరూం సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ఎం.సంజు(32)కు భార్య, ఇద్దరు సంతానం కాగా, ఎస్.శివకుమార్(46)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు దిండుగల్ నుంచి కలకత్తాకు కాటన్ లోడ్‌తో లారీలో బయలుదేరారు. ఈ క్రమంలో చెన్నై నుంచి ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఉన్న పవర్‌ప్లాంట్‌కు ఐరన్ పోల్స్‌తో వెళ్తున్న లారీ పడుగుపాడు సమీపంలో ఇక్కసారిగా నెమ్మదించింది. వెనుకనే కాటన్ లోడ్‌తో వస్తున్న వీరి లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు లారీలో ఉన్న ఐరన్ పోల్స్ వెనుక లారీ క్యాబిన్‌ను పూర్తిగా నుజ్జునుజ్జు చేసింది. ఈ ప్రమాదంలో సంజు, శివకుమార్ ఇద్దరూ మరణించారు. ఈ ఘటనతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీవ్రతను పరిశీలించారు. హైవేపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాద స్థలానికి క్రేన్‌ను రప్పించి క్యాబిన్‌లో ఇరుక్కున్న ఐరన్ పోల్స్‌ను తీయించారు. అయితే మృతదేహాలు గుర్తుపట్ట లేని విధంగా నుజ్జునుజ్జయింది. అతికష్టం మీద క్యాబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.